TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 263 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ ఆదివారం.19.04.2026 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD

## ప్రధాని మోడీకి లేఖ రాసిన ఇండియా బ్లాక్ ఎంపీలు



హైదరాబాద్: అమృత్ తెలంగాణ:పాత మహిళా రిజర్వేషన్ బిల్లు (2023 లో ఆమోదించిన) ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షం శనివారం ప్రధాని మోడీకి లేఖ రాసింది. నేడు ఈ విషయంపై ఇండియా బ్లాక్ ఎంపీలు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నేత సోనియాగాంధీ లోక్‌సభలో కీలక బిల్లులకు మెజార్టీ ఓటింగ్ లేకుండా చేసినందుకు ఆమె మిత్రపక్షాలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశం అనంతరం ఇండియా బ్లాక్ ఎంపీలు మీడియా సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. ఈ మీడియా సమావేవంలో మహిళా రిజర్వేషన్‌కు తాము మద్దతు ఇస్తున్నాము. కానీ ప్రభుత్వం రిజర్వేషన్ ముసుగులో దేశ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చడానికి ప్రయత్నిస్తోందని ఇండియా బ్లాక్ పార్టీలు వివరించనున్నట్లు తెలుస్తోంది.

కాగా, నేడు కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా మీడియాతో మాట్లాడుతూ.. 'అన్ని పార్టీలు ఆమోదించిన పాత మహిళా బిల్లును కేంద్రం సోమవారం నాడే వెంటనే పార్లమెంటు ముందుక తీసుకురావాలి. దీనికోసం సోమవారం నాడు పార్లమెంటు నిర్వహించమనండి. అప్పుడు బిల్లును సభ ముందుకు తెస్తే.. అసలు మహిళా వ్యతిరేకులు ఎవరో తెలుస్తుంది. పాత మహిళా బిల్లును తెస్తే మేమందరం కచ్చితంగా ఓటు వేసి దానికి మద్దతు ఇస్తాము' అని అన్నారు.

## త్వరలో పరిషత్ ఎన్నికలు -- ఓటర్ల మ్యాపింగ్‌కు ఎస్ఈసీ ఆదేశాలు




హైదరాబాద్: అమృత్ తెలంగాణ: తెలంగాణ రాష్ట్రంలో మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధమవుతున్న ది. ఈ దిశగా రాష్ట్ర ఎన్నికల సంఘం (టీజీ ఎస్ఈసీ) కీలక నిర్ణయం తీసుకున్నది. కేంద్ర ఎన్నికల సంఘం నుంచి అందిన తాజా ఓటర్ల జాబితా డేటా ఆధారంగా గ్రామ పంచాయతీ వార్డులవారీగా ఓటర్ల మ్యాపింగ్ చేయాలని ఎస్ఈసీ ఆదేశాలు జారీ చేసింది. జడ్పీ సీఈవోలు, డీపీవోలు, ఎంపీడీవోలు యుద్ధప్రతిపాదికన ఈ ప్రక్రియను పూర్తిచేయాలని ఎస్ఈసీ కార్యదర్శి లింగ్యానాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. 2026 ఫిబ్రవరి 5 నాటి కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా డాటా ఆధారంగా మండలాల వారీగా జాబితాలను రూపొందించాలని ఎస్ఈసీ ఆదేశించింది. ఈ జాబితాలను గ్రామ పంచాయతీ వార్డు రోల్స్‌కు మ్యాపింగ్ చేయాల్సి ఉంటుంది.

ఈ నెల 23లోగా నివేదిక

కొత్త డేటాను పాత జాబితాలతో పోల్చి చూసినప్పుడు ఏవైనా వ్యత్యాసాలు కనిపిస్తే, వాటిని గుర్తించి ఈ నెల 23వ తేదీలోగా నివేదించాలని అధికారులను ఎస్ఈసీ ఆదేశించింది. మండల, జిల్లా పరిషత్ ఎన్నికల నిర్వహణలో ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులు దొర్లకుండా ఉండేందుకు ఈ ప్రక్రియ అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నది. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల గడువు సమీపిస్తుండటంతో, ఓటర్ల విభజనతోపాటు వార్డుల వారీగా స్పష్టమైన ఓటర్ల జాబితా సిద్ధం కావడం అత్యవసరం. పంచాయతీ, మండల, జిల్లా స్థాయిలో ఓటర్ల సంఖ్యను కచ్చితంగా నిర్ధారించడం ద్వారా ఎన్నికల నోటిఫికేషన్‌కు మార్గం సుగమం కానున్నది. ఎస్ఈసీ తాజా ఆదేశాలతో జిల్లాల్లోని ఎన్నికల యంత్రాంగం, పంచాయతీరాజ్ అధికారులు ఓటరు లిస్టు మ్యాపింగ్ ప్రక్రియలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు నిర్వహించారు. ఇక జిల్లా, మండల పరిషత్ ఎన్నికలే మిగిలాయి. ఓటర్ల జాబితా అప్‌డేట్ ప్రక్రియ యుద్ధప్రాతిపదికన చేపడుతుండటంతో త్వరలోనే రాష్ట్రంలో పరిషత్ ఎన్నికల నగారా మోగుతుందనే ప్రచారం జోరుగా సాగుతున్నది.

## రాజ్యాంగ స్వరూపాన్ని మార్చడమే కేంద్రం ఉద్దేశం : మల్లికార్జున ఖర్గే



న్యూఢిల్లీ :అమృత్ తెలంగాణ: శుక్రవారం లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లుకు మెజార్టీ ఓటింగ్ రాకపోవడంతో వీగిపోయింది. దీంతో కీలకమైన మరో రెండు బిల్లులు మహిళా రిజర్వేషన్ బిల్లు, కేంద్రపాలిత ప్రాంతాల చట్టాల సవరణ బిల్లులను కేంద్రం ఉపసంహరించుకుంది. లోక్‌సభలో ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేయడం పట్ల కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఇండియా బ్లాక్ ఎంపీలు మహిళా వ్యతిరేకులు కారు అని అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'మేము మహిళలకు వ్యతిరేకులం కాదు. చాలాకాలంగా మూడింట ఒకవంతు మహిళా రిజర్వేషన్ కోసం కృషి చేస్తున్నాము. మేము 2023 సవరణకు ఏకగ్రీవంగా మద్దతు తెలిపి, దానిని ఆమోదించాము. అయితే దాని ముసుగులో వారు మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లులను ఏకీకృతం చేస్తూ, అందులో డీలిమిటేషన్ క్లాజును చేర్చి మరో సవరణను ప్రవేశపెట్టారు' అని అన్నారు. ఈ మూడు బిల్లులను కలిపి తీసుకురావడం ద్వారా భవిష్యత్తులో ఏ డీలిమిటేషన్ చట్టాన్నైనా సభలో సాధారణ మెజారిటీతో ఆమోదించుకుని, దాన్ని మార్చగలిగే అధికారాన్ని వారు పొందాలనుకున్నారు. అయితే వారు ఏది చేసినా ఇప్పుడున్న 543 మంది సభ్యులలోనే చేయాలి. కానీ అదిప్పుడు సాధ్యం కాలేదు. అయితే వారు తదుపరి జనాభా లెక్కలు లేదా కులగణన పూర్తయ్యాక, వచ్చే ఎన్నికల్లో పూర్తి చేయవచ్చు. అసలు రాజ్యాంగ స్వరూపాన్ని మార్చి, కార్యనిర్వాహక అధికారాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడమే వారి ఉద్దేశం అని ఖర్గే అన్నారు.

## తెలంగాణ భానుడి భగభగ..

హైదరాబాద్; అమృత్ తెలంగాణ:భానుడి భగభగలతో తెలంగాణ విలవిలలాడుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఎండలు తీవ్రరూపం దాల్చడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉదయం 8 గంటల నుంచి సూర్యుడు సుర్రుమంటున్నాడు. దీంతో ప్రజలు బయటకు రావాలంటేనే జంకుతున్నారు. భగ్గున మండే ఎండలకు తోడు.. తీవ్ర ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఫ్యాన్లు, కూలర్లను ఆశ్రయిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రధానంగా ఏడు జిల్లాల్లోని 20 మండలాలు తీవ్రమైన వడగాలుల కారణంగా అల్లాడిపోతున్నాయి. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఎండల తీవ్రత మరీ ఎక్కువగా ఉంది. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం వడగాలుల ప్రభావంతో సలసలా కాగిపోతోంది. దహేగాం, సిర్పూర్(యు) మండలాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఆదిలాబాద్, కామారెడ్డి, నిర్మల్, నిజామాబాద్, రంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లోని పలు మండలాల్లో వేడి గాలులు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి.

## త్వరలో భూముల ధరలు పెంపు: మంత్రి పొంగులేటి



హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: తెలంగాణలో భూముల ధరలు పెంచేందుకు కసరత్తు జరుగుతోందని, త్వరలో ధరలు పెంచుతామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి భూముల ధరలు పెంచలేదని, ధరణి సమస్యలు భూభారతితో పరిష్కారమవుతాయని ఆయన హామీ ఇచ్చారు. భూముల రిజిస్ట్రేషన్ మ్యాప్‌తో ఈనెల 20వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని, పాలేరులో మొదటి రిజిస్ట్రేషన్ జరుగుతుందని స్పష్టం చేశారు. రెవెన్యూలో కొత్త పాలసీ తేబోతున్నామని, కేబినెట్ విస్తరణ విడతల వారీగా జరుగుతుందని వెల్లడించారు.

## కేంద్ర ప్రభుత్వంపై సీఎం రేవంత్‌రెడ్డి విమర్శలు




హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: మహిళా బిల్లు పేరుతో డీలిమిటేషన్ బిల్లు తీసుకువచ్చారని కేంద్ర ప్రభుత్వంపై సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. మహిళా బిల్లు వీగిపోవడంతో ప్రతిపక్షాలపై అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ చాలా చేసింది. "మహిళా బిల్లు వీగిపోవడం.. బీజేపీ విధానాల ఓటమిగా భావించాలి. ఈ బిల్లుపై ప్రధానికి నిజాయతీ లేదు. నిజాయతీగా మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకువస్తే.. పార్లమెంట్‌లో మద్దతు తెలిపేవారు. మోడీ.. ఉత్తర, దక్షిణ భారత్ మధ్య అంతరాలు సృష్టించే విధానాన్ని విరమించుకోవాలి" అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

## ఉపాధి కూలీల ముఖానికి పౌడర్..




హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీలకు ముఖ చిత్రం గుర్తింపు తప్పనిసరి చేసింది. కానీ ముఖం గుర్తింపు రాక కూలీలు ఇంటికి తిరిగి వెళ్లతున్నారు. అయితే కుమురం భీమ్ జిల్లాలో ముఖం గుర్తింపు పడకుండా ఇబ్బందులు తొలగించడానికి జైనూర్ మండలం జామిని గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ బాబు వినూత్నంగా ఆలోచించాడు. ముఖ చిత్రాలు పడని వారి ముఖాలకు టాల్కమ్ పౌడర్ వేస్తున్నారు. ముఖానికి పౌడర్ కొట్టడంతో సులువుగా సెల్ ఫోన్?లో ముఖాల గుర్తింపు రికార్డు అవుతున్నాయి. ఈచిన్న ఉపాయంతో ఉపాధి కూలీలకు హాజరు నమోదవుతుంది. ముఖ గుర్తింపు కోసం ఈ ఫీల్డ్ అసిస్టెంట్ చేసిన ఉపాయం బాగుందని అందరూ అభినందిస్తున్నారు. ఉపాధి హామీ పనుల్లో ఇకపై కూలీల హాజరును ఫేస్ అథెంటికేషన్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## ఈవీ చార్జింగ్ మౌలిక వసతులు ఏర్పాటు చేయాలి

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: భవిష్యత్ అవసరాల దృష్ట్యా ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యంతో అధిక సంఖ్యలో ఈవీ చార్జింగ్ కేంద్రాల ఏర్పాటు కోసం సమగ్ర ప్రణాళికను రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. ఈవీ వాహనాల వినియోగం పెరిగిన నేపథ్యంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మరిన్ని చార్జింగ్ కేంద్రాలను ప్రజలకు అందుబాటులో ఉండేలా సమగ్ర వ్యవస్థ ఏర్పాటు కోసం చర్యలు తీసుకోవాలని సీఎస్ సూచించారు. డా.బీఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) చార్జింగ్ మౌలిక వసతుల అమలుపై శుక్రవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈవీ మౌలిక వసతులను విస్తరించడానికి చేపట్టాల్సిన చర్యలపై సీఎస్ సమీక్షించారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం వేగవంతం అవుతున్నందున, ఈ పెరుగుతున్న ఈవీ వినియోగదారుల అవసరాలను తీర్చడానికి విస్తృత చార్జింగ్ నెట్‌వర్క్ ఎంతో కీలకమని సీఎస్ పేర్కొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా ఏప్రిల్ 20వ తేదీ నుంచి 26వ తేదీ వరకు నిర్వహించనున్న సంక్షేమ వారోత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ ఆదేశించారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక సంక్షేమ వారోత్సవాల నిర్వహణపై హైదరాబాదు నుంచి, అన్ని జిల్లాల కలెక్టర్లతో సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా ఏప్రిల్ 20వ తేదీ నుంచి 26వ తేదీ వరకు నిర్వహించనున్న సంక్షేమ వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. వారం రోజులపాటు ప్రతిరోజు సంక్షేమ వారోత్సవాల్లో భాగంగా నిర్దేశించిన కార్యక్రమాలను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. అదేవిధంగా అన్ని జిల్లాల్లో వ్యవసాయ శాఖ పరిధిలో కొనసాగుతున్న ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను వేగవంతం చేసి వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. వీసీ అనంతరం జిల్లా అధికారులతో ఇంచార్జ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా ఏప్రిల్ 20వ తేదీ నుంచి 26వ తేదీ వరకు నిర్వహించనున్న సంక్షేమ వారోత్సవాలను పక్కాగా నిర్వహించేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వారోత్సవాల్లో భాగంగా మొదటి రోజైన ఏప్రిల్ 20వ తేదీన జిల్లాలోని అన్ని సంక్షేమ హాస్టళ్ళు, విద్యాసంస్థల్లో శానిటేషన్ డ్రైవ్ చేపట్టాలని సూచించారు. రెండో రోజు విద్యార్థులకు టాలెంట్ ఫెస్టివల్ పేరుతో క్విజ్, డిబేట్ వంటి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మూడో రోజున అన్ని సంక్షేమ వసతి గృహాలు, విద్యాసంస్థల్లో ఏమైనా మరమ్మతులు చేయాల్సి ఉంటే వాటిని పూర్తిచేయాలని ఆదేశించారు. నాలుగో రోజున విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాలకు ఆహ్వానించి ప్రభుత్వం విద్యార్థుల కోసం అమలు చేస్తున్న సౌకర్యాలపై వివరించాలని తెలిపారు. తదుపరి రోజుల్లో విద్యార్థులకు స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలు, సమ్మర్ క్యాంప్స్, బడిబాట కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఆర్ఎస్ చిత్రు (రెవెన్యూ) జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు

## వాసవి పూర్వ విద్యార్థికి సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగం..విఘ్నేష్ ని ఘనంగా సన్మానించిన వాసవి పాఠశాల కరస్పాండెంట్ పోత రెడ్డి..



సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగం సాధించిన విగ్నేష్ ను ఘనంగా సన్మానిస్తున్న వాసవి పాఠశాల కరస్పాండెంట్ పోతారెడ్డి, ప్రిన్సిపాల్ రాజ్ కుమార్

నిర్మల్ జిల్లా ఏప్రిల్ 18 అమృత్ తెలంగాణ నిర్మల్ వాసవి పూర్వ విద్యార్థి ఎం . విఘ్నేష్ కు సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగం జి.ఎస్.టి. ఒ కస్టమ్స్ ఇన్స్పెక్టర్ జాబ్ సంపాదించాడు గత సంవత్సరం నిర్వహించిన ఎస్ఎస్సి సిజిఎల్ -2025 పరీక్షలో ఉత్తీర్ణుడై ఈ ఉద్యోగం సాధించాడని కరస్పాండెంట్ పోతారెడ్డి, ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా విఘ్నేష్ మాట్లాడుతూ, తనకు వాసవి స్కూల్ లో లభించిన ఫౌండేషన్ ఎడ్యుకేషన్ వల్ల తనకు సోషల్ సబ్జెక్టు పై ఇష్టం పెరిగిందని, దానివల్ల తను సివిల్స్ కి ప్రిపేర్ అయ్యానని తెలియజేశారు. ఈ జాబ్ చేస్తూనే సివిల్స్ కి ప్రిపేర్ అవుతానని తెలియజేశారు ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం విఘ్నేష్ ని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో , ప్రిన్సిపాల్ రాజ్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జగిత్యాలలో త్వరలో పాస్పోర్ట్ ఆఫీస్ ఏర్పాటు !



జగిత్యాల అమృత్ తెలంగాణ ఏప్రిల్ 18: జిల్లాలో పోస్ట్ ఆఫీస్ పాస్పోర్ట్ సేవా కేంద్రం ఏర్పాటు దిశగా కీలక ముందడుగు పడింది. శనివారం నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు అరవింద్ ధర్మపురి తో కలిసి, కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ ని న్యూ ఢిల్లీలోని వారి కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా జగిత్యాల ప్రజల దీర్ఘకాలిక అవసరమైన ప్రత్యేక పాస్పోర్ట్ సేవా కేంద్రం ఏర్పాటుపై విజ్ఞప్తి పత్రాన్ని బిజెపి రాష్ట్ర నాయకురాలు డాక్టర్ బోగ శ్రావణి అందజేశారు. ఈ ప్రతిపాదనపై మంత్రి సానుకూలంగా స్పందించి, జగిత్యాల జిల్లాలో పాస్పోర్ట్ సేవల అవసరాన్ని గుర్తించి, త్వరలోనే (పి.ఓ.పి.ఎస్.కె) ఏర్పాటు దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ పోస్ట్ ఆఫీస్ పాస్పోర్ట్ కేంద్రం ఏర్పాటుతో జగిత్యాల మరియు పరిసర ప్రాంతాల ప్రజలకు పాస్పోర్ట్ సేవలు మరింత సులభంగా అందుబాటులోకి రానున్నాయి

## 33 రోజుల డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జ్ఞానదీక్షలను ఘనంగా ముగింపు..నియమా నీష్టాలతో జ్ఞాన దీక్షలను పాటించిన బుద్ధిష్టులు..





నిర్మల్ బుద్ధ విహారులో జ్ఞాన దీక్షల ముగింపు కార్యక్రమం

నిర్మల్ జిల్లా ఏప్రిల్ 18.అమృత్ తెలంగాణ నిర్మల్ జిల్లా కేంద్రంలోని సోఫి నగర్ లో గల నిర్మల్ బుద్ధ విహార్ లో నిర్మల్ బుద్ధ విహార్ కమిటీ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జ్ఞాన దీక్షలను మహనీయులైన మాన్యశ్రీ కాన్షీరామ్ జయంతి తేదీ.15.03.2026 రోజున ప్రారంభమై భారతరత్న, భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి, బోధిసత్వ పరమ పూజ్య డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135 వ జయంతి ఉత్సవాలు తేదీ. 14.04.2026 వరకు మొత్తం 33 రోజులపాటు కొనసాగినవి.

ఈ అంబేద్కర్ జ్ఞాన దీక్షల ముగింపు కార్యక్రమాలను తేదీ.17.04.2026 శుక్రవారం సాయంత్రం 7 గంటలకు గౌతమ బుద్ధుని విగ్రహానికి, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి, జ్యోతి ప్రజ్వలన చేసి పూల మాలలు వేసి పంచశీల ప్రార్థన చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ బుద్ధ విహార్ కమిటీ అధ్యక్షులు కుంటోల్ల వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి మధుకర్ మునేశ్వర్, భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షులు కొంతం మురళీధర్, తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు బత్తుల రంజిత్ కుమార్, దమ్మ సేవకులు దౌడ భాస్కర్, భగత్ నారాయణ, కొంతం అడెల్లు, సింగరి జగదీశ్వర్, కాడేపు అడెల్లు, చిట్టి మల్ల మోహన్, సోలోమాన్ రాజ్, కుమారి కుంటోల్ల సంఘమిత్ర లు తదితరులు పాల్గొన్నారు. రావుల గంగన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జీవిత చరిత్రపై గ్రంథ పఠనం చేశారు. అంతిమఘాత వందన సమర్పణ ప్రార్థన చేసి నెలరోజులపాటు జరిగినటువంటి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జ్ఞాన దీక్ష లను ముగింపు చేశారు. అనంతరము అరటి పండ్లు, లడ్డూలు, జిలేబిలను పంపిణీ చేశారు.

## ఉపాధి హామీ పథకం పై జిల్లా కలెక్టర్ సమీక్ష

## సమయానికి వేతనాలు చెల్లించేలా చర్యలు



మల్లాపూర్ అమృత్ తెలంగాణ ఏప్రిల్ 18: జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండల కేంద్రంలో ఉపాధి హామీ పథకం పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ శనివారం సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్య పెంపుపై ప్రత్యేకంగా చర్చించారు. గ్రామాల్లో మరిన్ని కూలీలను ఉపాధి హామీ పనుల్లో భాగస్వామ్యం చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో పనుల అందుబాటును పెంచాలని ఆదేశించారు. పనుల ఎంపికలో పారదర్శకత పాటించాలని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఉపాధి అవకాశాలు కల్పించాలని చెప్పారు. పనుల ప్రగతిని రోజువారీగా పర్యవేక్షించాలని అన్నారు. కూలీల హాజరు నమోదు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. మస్టర్ రోల్స్ లో ఎటువంటి లోపాలు ఉండకూడదని స్పష్టం చేశారు. కూలీలకు సమయానికి వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పనుల తీరుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఉపాధి హామీ పనులలో మహిళలను భాగస్వామ్యం చేయాలని తెలిపారు. ప్రతి పనిని ఫోటో క్యాప్చరింగ్ ద్వారా ఎన్ యం యం ఎస్ యాప్ లో నమోదు చేయాలని చెప్పారు. జియో ట్యాగింగ్ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు

## "ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా సంక్షేమ వారోత్సవాలు సమర్థవంతంగా నిర్వహించాలి : రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు





వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ జిల్లా అధికారులు పాల్గొన్న దృశ్యం

నిర్మల్ జిల్లా ఏప్రిల్ 18 అమృత్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా, ఈ నెల 20 వ తేదీ నుండి, 26 వ తేదీ వరకు 7 రోజుల పాటు సంక్షేమ వారాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, పలు శాఖల అధికారులతో సంక్షేమ వారం నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా ఈ నెల 20వ తేదీ నుండి 26వ తేదీ వరకు ప్రభుత్వ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ వసతి గృహాలు, విద్యాలయాలలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని తెలిపారు. విద్యార్థులకు క్విజ్, పెయింటింగ్ లాంటి పోటీలు నిర్వహించాలని పేర్కొన్నారు. వసతి గృహాలలో మరమ్మత్తు పనులను చేపట్టాలని తెలిపారు. ప్రత్యేక నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని, వేసవి శిబిరం, బడిబాట కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. రైతు రిజిస్ట్రేషన్ వంద శాతం పూర్తి చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, కలెక్టరేట్లోని సమావేశ మందిరం నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాపాలన - ప్రగతి -ప్రణాళిక కార్యాచరణలో ఈనెల 20వ తేదీ నుండి 26వ తేదీ వరకు 7 రోజుల పాటు ప్రజా భాగంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలోని ఎస్సి, ఎస్టి, బిసి, మైనారిటీ గురుకులాలలో, వసతి గృహాలలో పారిశుధ్యం, మరమ్మత్తు పనులు చేపడుతామని తెలిపారు. విద్యార్థులకు వివిధ విభాగాలలో పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రత్యేక నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. వేసవి శిబిరాలు, బడిబాట కార్యక్రమాలను జిల్లాలో అధికారుల సమన్వయంతో పకడ్బందీగా చేపడతామని, రైతుల రిజిస్ట్రేషన్ వంద శాతం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, సిపిఓ జీవరత్నం, జిల్లా సంక్షేమ అధికారి వినూత్న, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల అధికారులు దయానంద్, అంబాజీ, శ్రీనివాస్, మోహన్ సింగ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, డీఈవో భోజన్న, జెడ్పి సీఈవో భాగ్యలక్ష్మి, డిఎంహెచ్వో రాజేందర్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## బోథ్ నియోజకవర్గానికి అదనపు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని రాష్ట మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారిని కోరిన ఆడే గజేందర్



అమృత్ తెలంగాణ ఇచ్చోడ న్యూస్ బోథ్ నియోజకవర్గానికి అదనపు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాల్ చారి తో కలిసి కోరిన బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ బోథ్ నియోజకవర్గ ప్రజల గృహ సమస్యలను పరిష్కరించేందుకు అదనపు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేయాలని కోరుతూ రెవెన్యూ ఒ హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ని మాజీ మంత్రి వేణుగోపాల్ చారి తో కలిసి బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ కోరారు ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ బోథ్ నియోజకవర్గంలో పేద మరియు అవసరమైన కుటుంబాలు ఇంకా ఇళ్ల కోసం ఎదురుచూస్తున్నాయని వారికి గృహ వసతి కల్పించడం అత్యవసరమని మంత్రికి వివరించారు ముఖ్యంగా అర్హులైన లబ్ధిదారులకు అదనపు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని, బోథ్ నియోజకవర్గానికి సంబంధించిన ప్రతిపాదనలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్,మాజీ బోథ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నరసింహ దాస్,మాజీ ప్యాక్స్ డైరెక్టర్ చట్ల ఉమేష్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి, యువ నాయకుడు అలపాటి అచ్యుతానంద రెడ్డి, యండి సద్దాం, హీరా సింగ్, రాహిల్ తదితరులు పాల్గొన్నారు

## కొరటికల్ నుంచి రాష్ట్ర స్థాయికి ఎదిగిన జర్నలిస్టుకు ప్రభుత్వం గుర్తింపు

అమృత్ తెలంగాణ : అచ్చంపేట నియోజకవర్గం ఉప్పునుంతల మండలం కొరటికల్ గ్రామానికి చెందిన విద్యావంతుడు, జర్నలిస్టు, తెలంగాణ ఉద్యమకారుడు బోదనపెల్లి వేణుగోపాల్ రెడ్డిని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఈసీ) సభ్యుడిగా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. యూనివర్సిటీ కౌన్సిల్ సభ్యులుగా నలుగురిని నియమించగా, ప్రభుత్వం పక్షాన వేణుగోపాల్ రెడ్డికి అవకాశం కల్పించడం విశేషం. ప్రస్తుతం టి-సాట్ సీఈవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయనకు ఎడ్యుకేషన్ యూనివర్సిటీ కౌన్సిల్ మెంబర్గా నియామకం రావడం గౌరవప్రదంగా భావిస్తున్నారు. మారుమూల గ్రామమైన కొరటికల్లో వ్యవసాయ కుటుంబంలో జన్మించిన వేణుగోపాల్ రెడ్డి విద్యార్థి దశ నుంచే ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నారు. అనంతరం జర్నలిస్టుగా, జర్నలిస్టు ఉద్యమ నాయకుడిగా తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషిస్తూ అంచెలంచెలుగా ఎదిగారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా పాలనలో భాగస్వామ్యమవుతూ చురుకుగా పనిచేస్తున్న ఆయన తన నియామకానికి ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

# ప్లాస్టిక్ నిషేధానికి గోదూర్ ముందడుగు

## ప్లాస్టిక్ వద్దు - ఆరోగ్యం ముద్దు

## సర్పంచ్ ,ఉప సర్పంచ్, పాలకవర్గం ఆధ్వర్యంలో మొదటి అడుగు





ఇబ్రహీంపట్నం అమృత్ తెలంగాణ,: ఏప్రిల్ 18 జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం గూడూరు గ్రామంలోని గోధూర్ మహిళా సంఘం అక్కాచెల్లెళ్ళు ప్లాస్టిక్ పూత కలిగిన పేపర్ గ్లాసులను పూర్తిగా పక్కన పెట్టి, స్టీలు గ్లాసులు కొనుగోలు చేసి వాడడం ఈరోజు నుండి ప్రారంభించారు. మాటల్లో కాదు, చేతల్లో చూపించారు. మహిళా భవనం, గోదూర్ వద్ద అందరూ స్టీలు గ్లాసులు చేతపట్టి ప్లాస్టిక్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. లిగ్రామంలో మార్పు మొదలైంది. మహిళా సంఘం బాటలో మిగతా అందరూ నడవాలి.

షాపులు, ఫంక్షన్లు, ఇండ్లు అన్నిచోట్ల ప్లాస్టిక్ బంద్ చేద్దాం. అని సర్పంచ్ బండీ రాజేష్ ఉపసర్పంచ్ ఓంకార్ లక్ష్మణ్ అన్నారు ఇట్టి కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హర్షద్, కరోబార్ దేవేందర్ శ్రీనివాస్ మహిళా సంఘం సభ్యులు మహిళలు , వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు ప్లాస్టిక్ వద్దు – గోదూర్ అభివృద్ధి ముద్దు

# సీఎం ప్రత్యేక ప్రిన్సిపల్ సెక్రటరీని మర్యాద పూర్వకంగా కలిసిన బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్



అమృత్ తెలంగాణ ఇచ్చోడ న్యూస్ తెలంగాణ సచివాలయంలో సీఎం ప్రత్యేక ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీ శేషాద్రి ని మాజీ కేంద్ర మంత్రివర్యులు వేణుగోపాల్ చారి తో కలిసి బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ మర్యాదపూర్వకంగా కలిశారు ఇటీవల బోథ్ మండల కేంద్రంలో ఫైర్ స్టేషన్ మంజూరుకు సహకరించినందుకు శ్రీ శేషాద్రి కి ఆడే గజేందర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజల భద్రతకు ఫైర్ స్టేషన్ ఎంతో అవసరమని, ఈ నిర్ణయం బోథ్ ప్రాంతానికి ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై కూడా చర్చించినట్లు తెలిపారు. ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు మరిన్ని సదుపాయాలు తీసుకురావడానికి కృషి చేస్తామని ఆడే గజేందర్ వెల్లడించారు ఆయన వెంట నాయకులు బోథ్ బ్లాక్ ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్,మాజీ ఎంపీటీసీ చాట్ల ఉమేష్,మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నర్సింహ దాస్, నాయకులు అచ్యుతానంద రెడ్డి,బద్దం పోతారెడ్డి,యండి సద్దాం తదితరులు ఉన్నారు

# పి.ఎం. అజయ్ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

## : జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య





అమృత్ తెలంగాణ మంచిర్యాల జిల్లా న్యూస్ ఏప్రిల్ 18, 2026: పి.ఎం.--అజయ్ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య అన్నారు. శనివారం ప్రధానమంత్రి అజయ్ పథకంలో ఎంపికైన జైపూర్ మండలం కిష్టాపూర్ గ్రామపంచాయతీ లోని రొమ్మిపూర్ గ్రామాన్ని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల పంచాయతీ అధికారి, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్ లు, వార్డు సభ్యులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా మురుగు కాలువల శుభ్రతపై చర్యలు తీసుకోవాలని, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించి, పనులను నాణ్యతతో పాటు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, పిల్లలకు అందిస్తున్న గుడ్లు, పాలు, పోషకాహారాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామంలోని స్వయం సహాయక సంఘాల సభ్యులు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ద్వారా పొందుతున్న ప్రయోజనాలను తెలుసుకున్నారు. మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధిగా ఎదగాలని, ప్రభుత్వ పథకాల అవకాశాలను పూర్తిగా వినియోగించుకోవాలని తెలిపారు. గ్రామస్తులతో మాట్లాడి ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై అభిప్రాయాలను తెలుసుకుని, అందరూ పథకాల ప్రయోజనాలను పూర్తిగా వినియోగించుకోవాలని తెలిపారు. గ్రామాభివృద్ధి పనులు సమయానికి, నాణ్యతతో పూర్తి అయ్యేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. గ్రామంలోని మురుగునీటి పారుదల వ్యవస్థ నిర్వహణపై కిష్టాపూర్ పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వెలిపించారు. అంతకుముందు కుందారం గ్రామాన్ని సందర్శించి ఉపాధి హామీ పథకం కింద వేతన కార్మికులు చేపడుతున్న పనులను పరిశీలించారు. కార్మికులకు కల్పిస్తున్న సౌకర్యాలను సమీక్షించి, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ద్వారా పొందుతున్న ప్రయోజనాల గురించి తెలుసుకున్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాలలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన జర్నలిస్టులకే అక్రిడిటేషన్లు

## నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు : జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్







నిర్మల్ జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యులతో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ జిల్లా ఏప్రిల్ 18 అమృత్ తెలంగాణ నిర్మల్ జిల్లా లో నిబద్ధతతో పనిచేస్తున్న నిజమైన జర్నలిస్టులందరికీ ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేస్తామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ స్పష్టం చేశారు. నూతనంగా ఏర్పాటైన జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు శనివారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అక్రిడిటేషన్ల జారీ ప్రక్రియలో పారదర్శకతకు పెద్దపీట వేయాలని, అర్హత గల ప్రతి విలేకరికి కార్డు అందేలా చూడాల్సిన బాధ్యత జిల్లా పౌర సంబంధాల అధికారి (డిపిఆర్ఓ), కమిటీ సభ్యులపై ఉందన్నారు. అక్రిడిటేషన్ కార్డుల మంజూరుకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన జీవోలోని మార్గదర్శకాలను కలెక్టర్ ఈ సందర్భంగా వివరించారు. ముఖ్యంగా క్రిమినల్ నేపథ్యం ఉన్న వ్యక్తులు, ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బందికి కార్డులు జారీ చేయకూడదని ఆమె ఆదేశించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని, త్వరలోనే జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమిటీ పూర్తిస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఇ. విష్ణువర్ధన్, కమిటీ సభ్యులు అల్వాల హనుమంతు, కొండూరి రవీందర్, అల్లం అశోక్, ఆర్. మహేందర్, ఎం.ఏ. వసీం, రామెళ్ళ రాజేశ్వర్, సిరిపురం నాగరాజు, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కెఆర్ కె కాలనీలో చలివేంద్రాన్ని ప్రారంభించిన బోరంచు శ్రీకాంత్ రెడ్డి




చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న బోరంచు శ్రీకాంత్ రెడ్డి దృశ్యం



చలివేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంలో మీడియాతో మాట్లాడుతున్న కిషన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి

అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ వేసవికాలం దృష్యా ప్రజల దాహార్తిని తీర్చేందుకు జిల్లా అదిలాబాద్ కేంద్రంలోన కె ఆర్ కె ఏర్పాటుచేసిన జనతా చలివేంద్రాన్ని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా చలివేంద్రం నిర్వాహకులు కాలనీ వాసులతో కలిసి పలువురి కి మంచినీటిని అందజేసి చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం కాలనీలో వైద్య సేవలు అందిస్తున్న ఆదిలాబాద్ రిమ్స్ సీఎంఓ అలీషా ఫాతిమా, మాజీ కౌన్సిలర్ డా. లక్ష్మణ్ ని ప్రత్యేకంగా అభినందించి వారు అందిస్తున్న సేవలను కాలనీ వాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ముబారక్, మౌలానా, సాదీఖ్ , సయాద్ జుబేర్, హఫీజ్, నారాయణ్ అడ్వకేట్, మాజీ కో ఆప్షన్ మెంబర్ అజీజ్, అల్మాస్, అజర్, అశోక్ , అన్వర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు

# 7 రోజుల సంక్షేమ వారాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి : రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు





వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న మంచిర్యాల జిల్లా కలెక్టర్

అమృత్ తెలంగాణ మంచిర్యాల జిల్లా న్యూస్ ఏప్రిల్ 18, 2026; ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ నెల 20వ తేదీ నుండి 26వ తేదీ వరకు 7 రోజుల పాటు సంక్షేమ వారాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంక్షేమ శాఖల అధికారులతో సంక్షేమ వారం నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా ఈ నెల 20వ తేదీ నుండి 26వ తేదీ వరకు ప్రభుత్వ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలలో షెడ్యూల్డ్ కులములు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు, మైనారిటీ గురుకులాలలో, విద్యాలయాలలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని తెలిపారు. విద్యార్థులకు క్విజ్, విద్య విశ్లేషణ, చిత్రలేఖనం, పెయింటింగ్ పోటీలు నిర్వహించాలని, వసతి గృహాలలో మరమ్మత్తు పనులను చేపట్టాలని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి వసతులపై చర్చించాలని సూచించారు. స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలు చేపట్టాలని, వేసవి శిబిరం, బడిబాట కార్యక్రమాలు నిర్వహించాలని, రైతు రిజిస్ట్రీ 100 శాతం పూర్తి చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈనెల 20వ తేదీ నుండి 26వ తేదీ వరకు 7 రోజుల పాటు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలోని 102 ఎస్.సి., ఎస్.టి., బి.సి., మైనారిటీ గురుకులాలలో, వసతి గృహాలలో వంటగది, పారిశుధ్యం, మరమ్మత్తు పనులు చేపడుతామని, విద్యార్థులకు వివిధ విభాగాలలో పోటీలు నిర్వహిస్తామని, స్కిల్ డెవలప్మెంట్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు.

వేసవి శిబిరాలు, బడిబాట కార్యక్రమాలను జిల్లాలో అధికారుల సమన్వయంతో పకడ్బందీగా చేపడతామని, రైతుల రిజిస్ట్రీ 100 శాతం పూర్తి చేసేందుకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి భాగ్యవతి, గృహ నిర్మాణ శాఖ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా మైనర్లకు కౌన్సెలింగ్ నిర్వహించిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల






అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రతా కార్యక్రమంలో భాగంగా ఈరోజు నిర్మల్ పట్టణంలోని ఆర్టీఓ కార్యాలయం వద్ద ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తూ మైనర్ డ్రైవింగ్ చేస్తున్న వారికి జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ఐపీఎస్ వారికి ప్రత్యేక కౌన్సెలింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, మాట్లాడుతూ... మైనర్లు వాహనాలు నడపడం చట్ట విరుద్ధమే కాకుండా ప్రాణాపాయం కలిగించే చర్య అని స్పష్టం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. చిన్నపిల్లలు డ్రైవింగ్ చేయడం వల్ల జరిగే ప్రమాదాలు చాలా తీవ్రమైనవని, అలాంటి ఘటనల్లో ప్రాణ నష్టం, శాశ్వత గాయాలు కలగవచ్చని వివరించారు. అదేవిధంగా, వేగ పరిమితులు పాటించడం, హెల్మెట్ మరియు సీట్ బెల్ట్ వినియోగం, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించడం వంటి ప్రాథమిక రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని, మైనర్ డ్రైవింగ్ కేసుల్లో తల్లితండ్రులదే బాధ్యత అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ తో పాటు టౌన్ ఇన్స్పెక్టర్ సమ్మయ్య,ఆర్.ఐ రామ్ నిరంజన్ రావ్,ఎస్.ఐ లు,ఆర్.ఎస్.ఐ లు, మైనర్ల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# జనగణనలో పొరపాట్లకు తావివ్వద్దు

## సోషల్ మీడియా మార్కెటింగ్ సేవలు : జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

అమృత్ తెలంగాణ : జనగణన ప్రక్రియలో పాల్గొనే ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు వారికి ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకొని, ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా జనగణన ప్రక్రియ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శనివారం మర్రికుంటలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రారంభమైన ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్ల శిక్షణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ జనగణన లో పాల్గొనబోయే ఎన్యుమరేటర్లకు పలు కీలక సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జనగణన ప్రక్రియలో పాల్గొనే ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు వారికి ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకొని, ఎలాంటి తప్పులు లేకుండా జనగణన ప్రక్రియ నిర్వహించాలని ఆదేశించారు. ఎన్యుమరేటర్లు క్షేత్రస్థాయికి వెళ్లే ముందు తమకు అందజేసిన హౌస్ లిస్టింగ్ బ్లాక్ మ్యాప్ ఆధారంగా హద్దులను ముందస్తుగా తనిఖీ చేసుకోవాలని సూచించారు. ఎవరి పరిధిలో వారే జన గణన ప్రక్రియ నిర్వహించాలని సూచించారు.

# మ్యూల్ అకౌంట్స్ లేకుండా పూర్తి జాగ్రత్తలు పాటించాలి

**జిల్లాలో సైబర్ క్రైమ్ జరగకుండా సమిష్టి కృషితో పనిచేయాలి**
**ప్రజల ఆర్థిక రక్షణకై, నేరాల నియంత్రణకు కృషి చేద్దాం**
**భద్రతా అంశాలలో ఎలాంటి జాప్యం వహించవద్దు**
**మోషన్స్ సెన్సార్స్, సీసీటీవీ కెమెరాల పనితీరుపై సెల్ఫ్ ఆడిట్ చేసుకోవాలి**
**జిల్లాలోని అన్ని జాతీయ బ్యాంకు మేనేజర్లు, అధికారులతో సమావేశం : జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**


సమావేశంలో మాట్లాడుతున్న అదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్


హాజరైన వివిధ బ్యాంకు మేనేజర్ దృశ్యం

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ జిల్లాలో సైబర్ క్రైమ్ అడ్డుకోవడానికి మరియు మ్యూల్ అకౌంట్ లేకుండా చేయడానికి ఈరోజు స్థానిక పోలీసు ఏఆర్ హెడ్ క్వార్టర్స్ సమావేశ మందిరం నందు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అధ్యక్షతన అన్ని జాతీయ స్థాయి బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ బాధితులను రక్షించే దిశగా అమాయకులను కాపాడే దిశగా జిల్లా పోలీసు యంత్రాంగం చేపట్టే కార్యక్రమాలలో అన్ని బ్యాంకులు సమిష్టిగా కృషిచేసి ప్రజల ఆర్థిక నష్టాలను కాపాడుతామని పిలుపునిచ్చారు. ముఖ్యంగా నకిలీ ఆధారాలతో బ్యాంకు అకౌంట్ల ను తీస్తున్న వారిని గుర్తించాలని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సైబర్ క్రైమ్ ద్వారా మోసపోతున్న వారిలో, బాధితులు ఎక్కువ శాతం మహిళలు విద్యార్థులు ఉన్నందున వాటిపట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. బ్యాంకర్లు కరెంటు అకౌంట్ జారీచే సందర్భంలో పూర్తి జాగ్రత్తలను సక్రమంగా పాటించాలని, సైబర్ క్రైమ్ నిందితులు వారిని సులువుగా మభ్యపెట్టి అమాయకులను డబ్బు ఆశ చూపి, నేరాలలో పాల్పడేలా ప్రోత్సహించడం జరుగుతుందని, వాటి పట్ల అప్రమత్తతతో వ్యవహరించాలని తెలిపారు. సైబర్ క్రైమ్ నిందితులను పట్టుకోవడానికి బ్యాంకు అధికారుల సహకారం ఎంతగానో అవసరం ఉంటుందని, ఇలాగే మీ సహకారం జిల్లా పోలీసు వ్యవస్థకు కొనసాగాలని తెలిపారు. ఎలాంటి అనుమానాస్పద లావాదేవీలైన వెంటనే జిల్లా పోలీస్ యంత్రాంగానికి తెలియజేయాలని దాని ద్వారా బాధితులకు త్వరితగతిన న్యాయం చేకూర్చడం జరుగుతుందని తెలిపారు.

బ్యాంకుల నందు హై సెక్యూరిటీ పద్ధతులను పాటించాలని అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి మోషన్స్ సెన్సార్, సిసి టివి కెమెరాలను ఏర్పాటు చేయాలని, అలారం వ్యవస్థ పటిష్టంగా పనిచేస్తుందని ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ ఉండాలని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో పలు రకాల సైబర్ క్రైమ్ నేరాలు జరుగుతున్న సందర్భంలో ప్రజలు అప్రమత్తతో వ్యవహరించాలని తెలిపారు. ఆర్థిక నేరాలలో వెంటనే 1930కి సంప్రదించినట్లయితే, నష్టపోయిన డబ్బును అకౌంట్లో నందు నిలిపి ఉంచే విధంగా తగు చర్యలు చేపట్టి తిరిగి బాధితులకు వచ్చే విధంగా జిల్లా పోలీసు వ్యవస్థ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సైబర్ క్రైమ్ బృందం చే చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కోర్టు ద్వారా వచ్చిన ఉత్తర్వులను వెంటనే అమల్లోకి తెచ్చి బాధితులకు తిరిగి డబ్బులు వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, టూ టౌన్ సీఐ నాగరాజు, ఝజూం ఇన్స్పెక్టర్ ప్రేమ్ కుమార్, అన్ని బ్యాంకు లో మేనేజర్లు అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వాహనదారులు నిబంధనలు ఖచ్చితంగా పాటించాలి : జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





అమృత్ తెలంగాణ మంచిర్యాల జిల్లా న్యూస్ ఏప్రిల్ 18, 2026: వాహనదారులు రహదారి భద్రతా నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వేంపల్లి లో గల జిల్లా రవాణా శాఖ అధికారి కార్యాలయ ఆవరణలో అరైవ్ అలైవ్ లో భాగంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి జిల్లా రవాణా అధికారి సిహెచ్. రంజిత్, అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో అరైవ్ అలైవ్ లో భాగంగా ఆటో, లారీల డ్రైవర్లకు వైద్య పరీక్షలు, కంటి పరీక్షలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులతో దాదాపు 200 మంది డ్రైవర్లకు పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్నవారికి మందులు, కంటి అద్దాలు అందించడం జరిగిందని తెలిపారు. రోడ్లపై ప్రయాణించే సమయంలో రక్షణ ముఖ్యమని, ప్రతి వాహనదారుడు లైసెన్స్ కలిగి ఉండాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారులో ప్రయాణించేవారు సీటు బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. వాహనం నడిపే సమయంలో వేగ పరిమితి అనుసరించాలని, మద్యం సేవించి, మొబైల్ మాట్లాడుతూ వాహనం నడపకూడదని తెలిపారు. ప్రజల రక్షణలో భాగంగా వాహనదారులు ఎలాంటి కంటి సమస్యలు లేకుండా చూసుకోవాలని, వాహనాలు నడిపే వారికి కంటిచూపు అత్యవసరమని, కంటి పరీక్షలు నిర్వహించిన వారిలో అవసరం ఉన్నవారికి శస్త్రచికిత్స చేయడం జరుగుతుందని తెలిపారు. రోడ్డు ప్రమాదం అంటే ఒక కుటుంబానికి జరిగే ప్రమాదమని తెలిపారు. జిల్లాలో రహదారులపై లైట్లు, బ్లైండ్ స్పాట్లను గుర్తించి తగు ఏర్పాట్ల చేయడం జరుగుతుందని, సిగ్నల్ వ్యవస్థలను ఏర్పాటు చేసి వాహనాలను నియంత్రించడం జరుగుతుందని తెలిపారు. అనుభవానికి, ప్రమాదానికి సంబంధం లేదని, వాహనం నడిపి సమయంలో ఏకాగ్రతతో నడపాలని తెలిపారు.

. ప్రతి వాహనానికి సంబంధించి ధ్రువపత్రాలు కలిగి ఉండాలని, రాంగ్ రూట్ లో వాహనం నడపకూడదని తెలిపారు. తనిఖీలలో మద్యం సేవించి వాహనం నడుపుతూ దొరికినట్లైతే సంబంధిత వాహనదారుడి లైసెన్స్ సస్పెండ్ చేయడం జరుగుతుందని, 18 సంవత్సరాల వయసు నిండని వారు వాహనాలు నడపకూడదని, ఒకవేళ నడిపినట్లయితే వారి తల్లితండ్రులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అతివేగం చాలా ప్రమాదమని, వేగం పరిమితిలో ఉండి నిబంధనలు పాటించినట్లయితే గమ్యస్థానానికి సురక్షితంగా చేరుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఈదురు గాలులకు విరిగిపడిన స్థంభాలు

అమృత్ తెలంగాణ : మండల కేంద్రం బల్మూర్ లో శనివారం సాయంత్రం ఈదురు గాలులతో రెండు విద్యుత్ స్తంభాలు రోడ్డుపై చెట్లు విరిగిపడ్డాయి.

ఒక్కసారిగా ఉరుములు ఈదురు గాలులు తీవ్రంగా వీచడంతో బస్టాండు సమీపంలోని రెండు మినీ ట్రాన్స్ఫార్మర్ విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయి. అదేవిధంగా బాలుర హాస్టల్ వద్ద చెట్టు విరిగి రోడ్డుపై పడింది. దీంతో గంటపాటు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సంఘటన సమయంలో అక్కడ పశువులు,

గేదెలు, మనుషులు గానీ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. ఏది ఏమైనా ప్రస్తుతం ఈదురు గాలులు ఉరుగులు మెరుపులు వర్షాల కారణంగా పిడుగులు పడే అవకాశం ఉందని, జాగ్రత్తగా ఉండవలసిందేనని పలువురు మాట్లాడుకుంటున్నారు.

# రేపు జడ్చర్ల నియోజకవర్గంలో ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన

అమృత్ తెలంగాణ: జడ్చర్ల నియోజకవర్గంలో వివిధ మండలాలలో ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి ఆదివారం పలు అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొంటున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అల్వాల్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని 11 గంటలకు పిఎసిఎస్ ఆధ్వర్యంలో మొక్కల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తారూ, 12 గంటలకు మసిగుండ్లపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న శివపార్వతుల బ్రహ్మోత్సవాలలో పాల్గొని వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తారు. జడ్చర్ల మండలంలోని చిన్న ఆదిరాల గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. 1:30 PM సింగం దొడ్డి గ్రామంలో నూతనంగా వేస్తున్న యు జి డి పైప్ లైన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు.

# అందమైన గులాబీలా మృణాల్ మెరుపులు




గులాబీల మధ్య నవ్వుతూ.. మృణాల్ ఠాకూర్ తన లేటెస్ట్ ఫోటోషూట్‌లో వసంతాన్ని స్వాగతించేసింది. గులాబీల మధ్య నవ్వుతూ.. మృణాల్ ఠాకూర్ తన లేటెస్ట్ ఫోటోషూట్‌లో వసంతాన్ని స్వాగతించేసింది. కోస్మోపాలిటన్ మ్యాగజైన్ కోసం ఆమె చేసిన ఈ ఫోటోషూట్ ఎంతో బ్యూటీఫుల్ గా ఉంది. పూలతో ముడిపడిన రంగుల దుస్తులు మరింత అందంగా హైలెట్ అయ్యాయి. పింక్, గ్రీన్, క్రీమ్ రంగుల్లో ఉండే డ్రెస్సులతో ఆమె వేసిన పోజులు మనసును తాకేలా ఉన్నాయి. ఈ ఫోటోలు ఆమెలోని ఫెమినిన్ గ్లామర్‌తో పాటు ఇంటెన్సిటీని కూడా చూపిస్తున్నాయి. తెలుగు ప్రేక్షకులకు 'సీతారామం' చిత్రంతో చాలా దగ్గరైన మృణాల్.. ఆ తర్వాత 'హాయ్ నాన్న' లాంటి సినిమా ద్వారా మంచి గుర్తింపు పొందింది. తక్కువ సమయంలోనే దక్షిణాది పరిశ్రమలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకుంది. నటనలో ఆమె చూపించిన హావభావాలను ఇప్పటికే అన్ని వర్గాల ఆడియెన్స్ మెచ్చుకుంటారు. అదే అనుభూతిని ఈ ఫోటోల్లో కూడా పలికిస్తోంది. ఇక ఈ ఫోటోషూట్‌కు 'బ్లూమింగ్ ఇన్‌టు ఏ న్యూ సీజన్' అనే క్యాప్షన్ పెట్టిన మృణాల్.. వసంతాన్ని, కొత్త ప్రారంభం అంటూ అందమైన వివరణ ఇచ్చింది. ఫొటోషూట్ కోసం ఆమె ఫ్లవర్ ఆర్ట్‌ని పటిష్టంగా ఉపయోగించిన విధానం, బ్యాక్‌డ్రాప్ డిజైన్ వరకు అన్నీ ప్రత్యేకంగా నిలిచాయి. మొత్తానికి మృణాల్ ఠాకూర్ తన ఫోటోషూట్‌తో మరోసారి ఎంతగానో ఎట్రాక్ట్ చేసింది. ఇక ఆమె సినిమాల విషయానికి వస్తే.. మంచి విజయాలు వచ్చిన తరువాత కూడా అమ్మడు తొందర పడకుండా నెమ్మదిగా కంటెంట్ ఉన్న సినిమాలను సెలెక్ట్ చేసుకుంటోంది. ప్రస్తుతం బాలీవుడ్ లో సన్ ఆఫ్ సర్దార్ 2, పూజా మేరీ జాన్ లాంటి సినిమాల్లో నటిస్తోంది. అలాగే తెలుగులో అడివి శేష్ డెకాయిట్ లో కూడా ఆమె హీరోయిన్ గా నటిస్తోంది.

# బీచ్‌లో అందాల బికినీ శిల్పం

తాజాగా మరోసారి అంతా షాక్ అయ్యే విధంగా బికినీ ఫోటోలను షేర్ చేయడం ద్వారా వేదిక వార్తల్లో నిలిచింది. రెండు దశాబ్దాల క్రితం తమిళ్ మూవీ 'మద్రాసి' సినిమాతో సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ వేదిక. ఇండస్ట్రీలో అడుగు పెట్టి సుదీర్ఘ కాలం అయినా, నాలుగు పదుల వయసుకు చేరువ అయినా కూడా వేదిక అందం ఏమాత్రం తగ్గలేదు. ఈమధ్య కాలంలో వేదిక సోషల్ మీడియాలో షేర్ చేస్తున్న ఫోటోలు, వీడియోలు వైరల్ అవుతున్నాయి. కెరీర్ మొదటి నుంచి అందంగా, గ్లామర్ గా కనిపిస్తూ వస్తున్న వేదిక ఇప్పుడు కూడా ఏమాత్రం తగ్గకుండా అందంగా కనిపిస్తూ సోషల్ మీడియాలో నెటిజన్స్‌ను కవ్విస్తోంది. తాజాగా మరోసారి అంతా షాక్ అయ్యే విధంగా బికినీ ఫోటోలను షేర్ చేయడం ద్వారా వేదిక వార్తల్లో నిలిచింది. ప్రీ రిలీజ్ ఈవెంట్ బిగ్ ట్విస్ట్! తెలుగులో 2007లో నందమూరి కళ్యాణ్ రామ్‌తో కలిసి 'విజయదశమి' సినిమాతో అడుగు పెట్టిన వేదిక ఆ తర్వాత చాలా తెలుగు సినిమాల్లో నటించింది. కానీ ఆశించిన స్థాయిలో గుర్తింపు దక్కలేదు. తెలుగులో ఈమె బాలకృష్ణకు జోడీగా రూలర్ సినిమాలో నటించి మెప్పించింది. ఆ తర్వాత బంగార్రాజు సినిమాలో ముఖ్య పాత్రలో నటించడం ద్వారా మరోసారి అందరి దృష్టిని ఆకర్షించింది. తెలుగులో ఈమె గత ఏడాది రజాకార్, ఫియర్ సినిమాల్లో నటించి మెప్పించింది. గత ఏడాదిలోనే ఒక తమిళ్ సినిమాను కూడా చేయడం ద్వారా గత ఏడాది బిజీ బిజీగా ఉంది. ఈ ఏడాది రెండు లేదా మూడు సినిమాలతో ఈ అమ్మడు ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే గన అనే కన్నడ సినిమాతో



ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇదే ఏడాదిలో మరో రెండు సినిమాలతో వేదిక ప్రేక్షకుల ముందుకు వస్తుందని తెలుస్తోంది. సోషల్ మీడియాలో ఈమె రెగ్యులర్‌గా అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా వార్తల్లో నిలుస్తుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో 4.2 మిలియన్ ఫాలోవర్స్‌ను కలిగి ఉన్న వేదిక రెగ్యులర్‌గా అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. ఇప్పటికే చాలా సార్లు బికినీ ఫోటోలను షేర్ చేయడం అందరి దృష్టిని ఆకర్షించింది. ఇప్పుడు మరోసారి టూ పీస్ బికినీతో బీచ్‌లో ఫోటోలకు ఫోజ్ ఇచ్చి అందాల శిల్పమా అంటూ అంతా ఆశ్చర్య పోయే విధంగా ఫోటోలకు ఫోజ్ ఇచ్చి ఇలాంటి అందమైన ఫోటోలను షేర్ చేయడం వల్లే వేదిక కి ఇంకా వరుసగా ఆఫర్లు వస్తున్నాయి. అయితే స్టార్ హీరోల సినిమాలో నటించకున్నా ఈ స్థాయిలో పాపులారిటీ దక్కించుకుని, ఎక్కువ సినిమాల్లో నటించే అవకాశాలు దక్కించుకోవడం ఈమెకు మాత్రమే చెల్లిందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. కెరీర్ ఆరంభంలో మోడలింగ్ చేసిన ఈమె ప్రముఖ కంపెనీకి చెందిన యాడ్స్‌లో నటించడం ద్వారా గుర్తింపు దక్కించుకుని సినిమాల్లో ఆఫర్లు సొంతం చేసుకుంది. పలు అవార్డులను రివార్డులను, రికార్డ్‌లను సొంతం చేసుకున్న వేదిక ముందు ముందు అయినా తన అందంకు తగ్గ స్థాయిలో ఆఫర్లను సొంతం చేసుకుంటుందేమో చూడాలి

# చక్కనమ్మల స్నేహం అలా కుదిరింది!

బాలీవుడ్ యువనాయికలు సారా అలీఖాన్– జాన్వీ కపూర్ ల మధ్య స్నేహం అభిమానులకు కొత్తేమీ కాదు. ఈ జోడీ తరచుగా వెకేషన్ స్పాట్స్ నుంచి ఫోటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తుంటారు. ఇటీవలే ఆ ఇద్దరూ కలిసి కేదార్ నాథ్ ఆలయాన్ని సందర్శించినప్పటి ఫోటోలు వైరల్ అయ్యాయి. సారా అలీ ఖాన్ – జాన్వీ కేదార్ నాథ్ ఆలయాన్ని సందర్శించిన ఫోటోలను అభిమాన సంఘాలు పోస్ట్ చేయగా వాటిలో ఇద్దరూ శివుడిని ప్రార్థిస్తూ కనిపించారు. అంతకుముందు కూడా వీరిద్దరూ రణవీర్ సింగ్ 'ది బిగ్ పిక్చర్' అనే టీవీ షోలో కనిపించారు. తమ మధ్య స్నేహం గురించి మాట్లాడారు. ఎపిసోడ్ సమయంలో రణవీర్– జాన్వీ –సారాలను వారి స్నేహం (స్నేహితులు) గురించి ఎక్కువగా అడిగాడు. నిజానికి ఆ ఇద్దరికీ కామన్ ఫ్రెండ్స్ ఉన్నారు. కాలక్రమంలో స్నేహం కుదిరింది. జాన్వీ అందించిన వివరాల ప్రకారం.. ఆ ఇద్దరికీ చిన్నప్పటి నుంచి పరిచయం ఉంది. నేను సారాను ఒక అవార్డు ఫంక్షన్ లో మొదటిసారి కలిశాను.




# ఎర్ర చీర కట్టులో సంయుక్త



రెగ్యులర్‌గా సోషల్ మీడియా ద్వారా ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్ ద్వారా సంయుక్త మీనన్ తన అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. మలయాళ సినిమా పాప్‌కార్న్‌తో దాదాపు దశాబ్ద కాలం క్రితం సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ సంయుక్త మీనన్. వరుసగా మలయాళ సినిమాలు చేస్తూ వచ్చిన ఈమెకు 2018లో కలరి అనే తమిళ సినిమాలో నటించే అవకాశం దక్కింది. అత్యధిక మలయాళ సినిమాల్లో నటించిన సంయుక్త మీనన్ ఆ తర్వాత తమిళ్‌లో ఎక్కువ సినిమాల్లో నటించింది. ఈ అమ్మడు తెలుగు ప్రేక్షకులకు కూడా పలు సినిమాలతో సుపరిచితురాలు అయింది. తెలుగులో ఈమె భీమ్లా నాయక్ సినిమాలో ముఖ్య పాత్రలో నటించడం ద్వారా టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చింది. తెలుగు సినిమా ఇండస్ట్రీలో ఈ అమ్మడికి విరూపాక్ష సినిమాతో భారీ విజయం దక్కింది. తెలుగులో వరుసగా సార్, విరూపాక్ష, బింబిసార సినిమాలతో సక్సెస్‌లు దక్కాయి. దాంతో ఈ అమ్మడు ఎక్కువ ఆఫర్లు దక్కించుకుంది. ప్రస్తుతం తెలుగులో ఈమె మూడు సినిమాల్లో నటిస్తోంది. మూడు సినిమాలు సైతం ఈ ఏడాదిలోనే ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. భారీ అంచనాల నడుమ రూపొందుతున్న అఖండ 2 సినిమాలోనూ ఈమె కీలక పాత్రలో కనిపించబోతుందనే వార్తలు వస్తున్నాయి. ఇప్పటి వరకు ఆ విషయమై అధికారికంగా క్లారిటీ రాలేదు. నారి నారి నడుమ మురారి సినిమాలోనూ ఈమె నటిస్తున్న విషయం తెల్సిందే.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com